క్లుప్తంగా

అంగన్‌వాడీ కేంద్రంలో వీహెచ్‌ఎన్ డే



అంగన్‌వాడీ కేంద్రంలో వీహెచ్‌ఎన్ డే నిర్వహిస్తున్న దృశ్యం

పాలకొల్లు సెంట్రల్: మండలంలోని ఆగర్రు గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం వద్ద విలేజ్ హెల్త్ అండ్ న్యూట్రిషన్ (వీహెచ్‌ఎన్) డే కార్యక్రమాన్ని నిర్వహించారు. శుక్రవారం ఐసీడీఎస్ అధికారిణి సీహెచ్ ఇందిర ఆదేశాల మేరకు వీహెచ్‌ఎన్ డే కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నిర్వాహకురాలు మంగ తెలిపారు. గర్భిణులు, బాలింతలు ఏ సమయంలో ఎలాంటి ఆహారం తీసుకోవాలి? ఎప్పుడెప్పుడు పరీక్షలు చేయించుకోవాలి? కాల్షియం, ఐరన్ మాత్రలు ఎలా వాడాలి? అనే అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బాలింతలు, గర్భిణులకు ఎఫ్‌ఆర్‌ఎస్, టీహెచ్ ఆర్, ఆకుకూరలు పంపిణీ చేశారు.

కనకరత్నమాలకు విశిష్ట సేవారత్న అవార్డు



రాజమండ్రిలో కనకరత్నమాలను సత్కరిస్తున్న స్వర్ణ సోషల్ సర్వీసు సంస్థ

పెనుగొండ: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా భీమలాపురానికి చెందిన వాకర్స్‌క్లబ్ డిస్ట్రిక్ట్ డెప్యూటీ గవర్నర్ కొత్త కనక రత్నమాలను మదర్ థెరిస్సా విశిష్ట సేవా రత్న అవార్డుతో సత్కరించారు. ఈ మేరకు ఆచంటలో శుక్రవారం కొత్త కనకరతనమాల వివరాలను తెలిపారు. రాజమండ్రికి చెందిన స్వర్ణ సోషల్ సర్వీసు ఆర్గనైజేషన్ సంస్థ అవార్డును అందించి సత్కరించిందని వివరించారు. విశిష్ట సేవా అవార్డును పొందిన కొత్త కనక రత్నమాలను ప్రముఖులు అభినందించారు.

వైభవంగా జైన మందిర ప్రతిష్టాపనోత్సవాలు



ఆచంటలో గురుధ్యాన జైన్ మందిర ప్రతిష్ఠ మహోత్సవాలు నిర్వహిస్తున్న దృశ్యం

పెనుగొండ: ఆచంటలో నూతనంగా నిర్మించిన రాజేంద్ర సూరీశ్వరీజీ గురుధ్యాన జైన మందిర ప్రతిష్ఠ మహోత్సవాలు శుక్రవారం ప్రారంభించారు. దీంతో దేశ నలుమూలల నుంచి వచ్చిన జైనులతో ఆచంటలో సందడి నెలకొంది. ఈ నెల 8,9 తేదీల్లో ప్రతిష్ఠ జరగనుంది. దీనిలో భాగంగా శుక్రవారం జైన మందిరంలో బలపూజ, శాంతి పూజలు నిర్వహించారు. జైన గురువుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు.

కుళాయిల ద్వారా మురుగు నీటి సరఫరా

నరసాపురం : పట్టణంలోని 30, 31వవార్డులు స్టేషన్‌పేట, చినమామిడిపల్లి ప్రాంతాల్లో కొన్నిరోజులుగా కుళాయిల ద్వారా మురుగు నీరు వస్తుంది. దీంతో స్థానికులు రోగాల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ట్యాంకులను సరిగా శుభ్రం చేయకుండా నీటిని వదలడమే ఇందుకు కారణమని మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కనకాయలంకలో రామాలయం ప్రారంభం

యలమంచిలి: కనకాయలంక పంచాయతీ కార్యాలయం వద్ద పునర్నిర్మించిన హనుమద్ సీతాలక్ష్మణ భరత శతృఘ్న సమేత శ్రీ పట్టాభిరామ స్వామి ఆలయం ప్రారంభోత్సవ పూజలు గత నాలుగు రోజులుగా ఘనంగా నిర్వహిస్తున్నారు. వాడపర్రు వాస్తవ్యులు శతాధిక ప్రతిష్టాపనాచార్య సుదర్శనం వెంకట జనార్ధనాచార్యులు బ్రహ్మత్వంలో ప్రతిష్ఠ శుక్రవారం వైభవంగా చేశారు. గ్రామానికి చెందిన వలవలబొజ్జియ్య (దొరబాబు), సునీత దంపతులతో విగ్రహ ప్రతిష్ఠ, పులి శ్రీనివాసరావు, కనకలక్ష్మి దంపతులతో ఆలయ ధ్వజ స్తంభ ప్రతిష్ఠ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో అన్నసమారాధన నిర్వహించారు.

పీ-4 సర్వేపై అధికారులకు శిక్షణ

ఉండి: మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రతి కుటుంబ సమాచారాన్ని పూర్తి స్థాయిలో సేకరించే పనిలో భాగంగా నిర్వహించే పీ-4 (పబ్లిక్, ప్రైవేట్, పీపుల్, పార్టిసిపేషన్) సర్వేపై గ్రామ స్థాయి అధికారులకు రెండు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏఎస్‌ఓ రామారావు, మాస్టర్ ట్రైనీ ప్రవీణ్‌కుమార్ గ్రామ స్థాయి అధికారులకు శిక్షణను అందించారు. శనివారం నుంచి 18వ తేదీలోపు సర్వే పూర్తి చేయాలని సూచించారు.

వంతెన యాతన తీరేదెన్నడు?

- ప్రమాదకరంగా చినలంక ఉప్పుటేరు వంతెన
- ఇబ్బందులు పడుతున్న మత్స్యకారులు



చినలంక సముద్రానికి వెళ్లే మార్గంలో ఉప్పుటేరుపై కోతకుగురై ప్రమాదకరంగా ఉన్న వంతెన

నరసాపురం రూరల్: నిత్యం సముద్రవేటకు వెళ్లే మత్స్యకారులు, ఉప్పు కార్మికులు, రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉండే చినలంక ఉప్పుటేరుపై ఉన్న వంతెన శిథిలావస్థకు చేరుకుంది. తరచూ ఈ ప్రాంతంలో ద్విచక్రవాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఎన్నో ఏళ్లుగా ఇక్కడ ఇదే పరిస్థితి నెలకొన్నప్పటికీ పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదని మత్స్యకారులు ఆరోపిస్తున్నారు. బియ్యపుతిప్ప నుంచి పెదమైనవాని లంక మీదుగా పేరుపాలెం వైపు వెళ్లే ఉప్పుటేరుకు చినమైనవాని లంక గ్రామంలో తూరలపై ఏర్పాటు చేసిన వంతెనపై ఉన్న రోడ్డు మీదుగానే ఈ గ్రామవాసులంతా సముద్రం వద్దకు వెళ్లాల్సి ఉంటుంది. నిత్యం ఈ వంతెనపై సుమారు వందలాది మంది మత్స్యకారులు రాకపోకలు సాగిస్తుంటారు. ఇక్కడి తూరలు శిథిలమై రంధ్రాలు పడడంతో పలుచోట్ల రోడ్డు దిగబడిపోయి ప్రమాదకరంగా మారింది. ఉప్పుటేరు ఆటుపోట్లకు నిత్యం ఈ వంతెన కోతకు గురవుతూనే ఉంటుంది. గత ప్రభుత్వ హాయాంలో వంతెన బాగా శిథిలం కావడంతో తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టి ప్రయాణానికి అనువుగా చేశారు. అనంతరం వంతెన నిర్మాణానికి ప్రతిపాదనలు కూడా పంపారు.

ఉప్పుటేరు కోతతో ఇబ్బందులు

ఇటీవల ఉప్పుటేరు భారీగా కోతకు గురికావడంతో వంతెన పరిస్థితి దయనీయంగా మారింది. ఏ క్షణంలో ఏం జరుగుతుందోనని ఈ ప్రాంత వాసులు వాపోతున్నారు. వేకువజామునే 4 గంటల ప్రాంతంలో వల వేసేందుకు చీకట్లోనే మత్స్యకారులు దీపాలు చేతపట్టి సముద్ర చెంతకు వెళ్లాల్సి ఉంటుంది. అలాంటి సమయంలో ఈ రోడ్డుపై ఉంటున్న భారీ గుంతలుతోనూ ప్రమాదకరంగా ఉన్న శిథిల వంతెనతో పలు ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. వెంటనే ఈ ప్రాంతంలో పటిష్ట వంతెనను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

ప్రమాదకర స్థితిలో ప్రయాణిస్తున్నాం



నాకు వంతెన అవతల పర్రలో చెరువులు ఉన్నాయి. వాటి సాగు నిమిత్తం, నేను నా సోదరుడు నిత్యం ఈ వంతెనపై నుంచే రాకపోకలు సాగిస్తున్నాం. ఒక్కోసారి వంతెన కోతకు గురై ప్రమాదకర స్థితిలో ప్రయాణం సాగించాల్సివస్తుంది. ఈ వంతెన పూర్తిగా తెగిపోతే పెదమైనవానిలంక గ్రామం నుంచి తిరిగి రావడం తప్ప మరో మార్గం లేదు.

– తాడి లక్ష్మణస్వామి, చినమైనవానిలంక

వంతెన నిర్మాణం అత్యవసరం



ఈ వంతెనపై మా గ్రామస్తులమే కాకుండా నిత్యం చినమైనవానిలంక బీచ్‌ను సందర్శించే వారు కూడా నిత్యం ప్రయాణిస్తుంటారు. తుఫాన్‌లు వంటి పకృతి విపత్తుల సమయాల్లో జిల్లా స్థాయి అధికారులు సైతం ఈ వంతెనపై నుంచే ప్రయాణించాలి. అలాంటి పరిస్థితుల్లో మాత్రమే ప్రజాప్రతినిధులు, అధికారులు వంతెన నిర్మాణం గురించి మాట్లాడుతూ ఉంటారు. మా ఇబ్బందులను, వంతెన ఆవశ్యకతను దృష్టిలో ఉంచుకుని వెంటనే నిర్మించాలి.

– వాతాడి హరనాథ్, వేములదీవి వెస్ట్

నేడు జాతీయ లోక్ అదాలత్



పి.విజయదుర్గ

నరసాపురం: పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారం కోసం శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు నరసాపురం 10వ అదనపు జిల్లా జడ్జి పి.విజయదుర్గ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. నరసాపురం కోర్టు హాల్లో రెండు బెంచీలు ఏర్పాటు చేశామని స్పష్టం చేశారు. లోక్ అదాలత్‌లో వీలైనన్ని ఎక్కువ కేసులు రాజీ అయ్యేలా చూడాలని పోలీసుశాఖ, న్యాయవాదులకు విజ్ఞప్తి చేశారు.

చినలంక దుర్గమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేకాలంకరణలో దుర్గమ్మ

నరసాపురం రూరల్: మండలంలోని చినమైనవానిలంక గ్రామంలో ఉన్న దుర్గమ్మ వారిని ఆలయంలో శుక్రవారం ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యే పూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు. అనంతరం దాతల సహకారంతో అఖండ అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. పరిసర గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

మహిళలు ఆర్థిక సమానత్వం కోసం కృషి చేయాలి



పెనుగొండ: శ్రామిక సంఘాల ఆధ్వర్యంలో సంఘీభావ యాత్ర నిర్వహిస్తున్న దృశ్యం

పెనుగొండ: మహిళలకు ఆర్థిక సమానత్వం, స్వేచ్ఛా స్వాతంత్ర్యాలుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పెనుగొండ పంచాయతీ పార్కు వద్ద శ్రామిక మహిళలు సంఘీభావ కార్యక్రమంలో పాల్గొన్నారు. అన్ని రంగాల్లో మహిళలు శాసించే స్థాయికి చేరుకుంటున్నారన్నారు. అంగన్‌వాడీ ప్రాజెక్టు లీడరు కె.తులసి మాట్లాడుతూ మహిళల శ్రమ దోపిడీపై గళం విప్పాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు గుడిమెట్ల వరహాల రెడ్డి, శ్రామిక మహిళల పీడీ పరమేశ్వరి, నీలవేణి, శ్రీదేవి, ఉషశ్రీ, రాధ పాల్గొన్నారు.

పాలకొల్లులో..

పాలకొల్లు సెంట్రల్: విద్యార్థి ఉన్నత శిఖరాలను అధిరోహించాలంటే జ్ఞానంతో పాటు అభ్యసనం కూడా ఉంటే ఉత్తమ ఫలితాలను సాధించవచ్చని నరసాపురం తహసీల్దార్ తలారి రాజరాజేశ్వరి అన్నారు. శుక్రవారం స్థానిక దాసరి నారాయణరావు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మహిళా సాధికార సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాజరాజేశ్వరి మాట్లాడుతూ ముఖ్యంగా తల్లిదండ్రుల ప్రోత్సాహం ఎంతు ముఖ్యమైందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో నెహ్రూ యువ కేంద్రం జిల్లా సమన్వయకర్త రాజేష్, ప్రిన్సిపాల్ డాక్టర్ శోభారాణి, వైస్ ప్రిన్సిపాల్ రవిశంకర్, డాక్టర్ మణిమాల తదితరులు పాల్గొన్నారు.

జీవీఎస్‌వీఆర్‌ఎం పాఠశాలలో..

అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని స్థానిక జీవీఎస్‌వీఆర్‌ఎం మునిసిపల్ ప్రాథమిక పాఠశాలలో మహిళలను ఘనంగా సత్కరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాయపూడి భవానీప్రసాద్, ఉపాధ్యాయులు త్రిమూర్తులు, శశికళ తదితరులు పాల్గొన్నారు.

స్కీమ్ వర్కర్లకు కనీస వేతనం అమలు చేయాలి

పాలకొల్లు సెంట్రల్: స్కీమ్‌వర్కర్‌లకు కనీస వేతనం అమలు చేయాలని సీఐటీయూ నాయకుడు జవ్వాది శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శుక్రవారం వీవర్స్ కాలనీలో మహిళా సంఘం భవనంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో భాగంగా ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ మహిళలపై లైంగిక వేధింపులు అరికట్టాలని సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీహెచ్ దేవి, సీహెచ్ లక్ష్మీ, జానకి, పద్మావతి, ఝాన్సీ, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సమతుల్య ఆహారంతో ఆరోగ్యం

యలమంచిలి: అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చే సమతుల్య ఆహారాన్ని స్వీకరించి గర్భిణులు, బాలింతలు సంపూర్ణ ఆరోగ్యం పొందాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మహ్మద్ హసీనా కోరారు. అంతర్జాతీయ మహిళ దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం చించినాడలో బాల్య వివాహాలను అరికట్టాలని కోరుతూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలతో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రంలో ప్రతి నెలా ఇచ్చే రేషన్‌లో మంచి పోషక విలువలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌ఎం టి.దుర్గమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు రజనీ, భారతి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



యలమంచిలి: చించినాడలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు



పాలకొల్లు సెంట్రల్: డీఎన్నార్ కళాశాలలో మాట్లాడుతున్న తహసీల్దార్ రాజరాజేశ్వరి

ఆధునిక పరిజ్ఞానంతో కేసులు దర్యాప్తు చేయాలి



వార్షిక తనిఖీలు నిర్వహిస్తున్న ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్, ఎస్పీ నయీం అస్మి

పెనుమంట్ర : పోలీస్ స్టేషన్‌లో ఆధునిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని కేసులను దర్యాప్తు చేయాలని ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ పోలీస్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన పెనుమంట్ర పోలీస్ స్టేషన్‌లో వార్షిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో పలు రికార్డులను పరిశీలించి పెండింగ్‌లో ఉన్న పలు కేసులపై ఆరా తీశారు. ముఖ్య ప్రాంతాలలో సీసీ కెమేరాలను ఏర్పాటు చేసి వాటి పనితీరును ఎప్పటికప్పుడు సమీక్షించడం కమ్యూనిటీ ఫ్రెండ్లీ పోలీసింగ్ ద్వారా ప్రజలలో అవగాహన సదస్సులు నిర్వహించి సోషల్ మీడియా ద్వారా తప్పుడు ప్రచారం చేసే వారిని అరికట్టాలన్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మహిళలకు ప్రత్యేక రక్షణ చట్టం ద్వారా భరోసా కల్పిస్తున్నట్లు వివరించారు. ఈ తనిఖీల్లో జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మీ, నరసాపురం డీఎస్పీ జి.శ్రీవేద, ట్రైనీ డీఎస్పీ మానస, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ వి.పుల్లారావు, పెనుగొండ సీఐ ఆర్.విజయ్‌కుమార్, ఎస్సై కె.స్వామి, ఏఎస్సై వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎంఎస్‌ఎంఈ సర్వేకు సహకరించాలి

నరసాపురం: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నరసాపురం మున్సిపాలిటీలో వ్యాపార దుకాణాల ఎంఎస్‌ఎంఈ సర్వే చేపట్టామని మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. మున్సిపల్ సిబ్బంది వచ్చినప్పుడు షాపుల యజమానులు ఆధార్‌కార్డు, పాన్‌కార్డు, జీఎస్టీ నెంబర్, బ్యాంకు అకౌంట్ నెంబర్ చూపించి సహకరించాలని సూచించారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో చాంబర్స్ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థినులను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

పాలకొల్లు సెంట్రల్: భీమవరంలో డాక్టర్ సీఎస్ఎన్ డిగ్రీ అండ్ పిజీ కళాశాలలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి సైన్స్ వర్క్ షాప్ ఫ్లెయిర్‌లో తమ కళాశాల విద్యార్థినులు ప్రథమ స్థానం సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వెంకటేశ్వరరావు శుక్రవారం విలేకరులకు తెలిపారు. ఈ నెల 5న భీమవరంలో రాష్ట్రస్థాయి పోస్టర్ ప్రజెంటేషన్ నిర్వహించారు. కళాశాలలో బయోటెక్నాలజీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న బిందు బార్గవి, పూర్ణిమలకు పోస్టర్ ప్రజెంటేషన్‌లో రాష్ట్రస్థాయిలో ప్రథమ బహుమతి లభించిందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను, తర్ఫీదునిచ్చిన అధ్యాపకులను అభినందించారు. కళాశాల చైర్మన్ కారుమూరి వెంకట నరసింహారావు, డాక్టర్ ఏబీఎస్ మూర్తి, నందుల సీతారామారావు, కటారి నాగేంద్రకుమార్, అధ్యాపకులు అంజలి, సిరి చందన పాల్గొన్నారు.

అప్పులపై అడ్డంగా దొరికిపోయిన టీడీపీ



ఉచ్చుల స్టాలిన్

యలమంచిలి: గత ప్రభుత్వంచేసిన అప్పు రూ.3,39,580 కోట్లు మాత్రమేనని అసెంబ్లీలో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ చేసిన ప్రకటనతో రాష్ట్ర అప్పులపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, విద్యా శాఖ మంత్రి లోకేష్, జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామనాయుడు చేస్తున్న గ్లోబెల్ ప్రచారం బట్టబయలయ్యిందని వైఎస్సార్ సీపీ నాయకుడు ఉచ్చుల స్టాలిన్ విమర్శించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. జగన్‌మోహన్‌రెడ్డి ఆర్థిక విధ్వంసం సృష్టించారని, రూ.14 లక్షల కోట్లు అప్పు చేసి రాష్ట్రాన్ని సర్వ నాశనం చేశారని కూటమి నాయకుల చేస్తున్న ప్రచారం నిజం కాదని ఆర్థిక మంత్రి ప్రకటనతో తేటతెల్లం అయ్యిందని పేర్కొన్నారు. ముఖ్యంగా పాలకొల్లు నియోజకవర్గంలో మంత్రి రామానాయుడిని ప్రతి సమావేశంలో ప్రజలు సూపర్ సిక్స్ పథకాలు గురించి అడుగుతుంటే ఆంధ్రప్రదేశ్‌లో ఒక్కొక్కరి తల మీద రూ. 2 లక్షల 40వేలు అప్పు ఉందని అబద్ధాలు చెప్తున్నారని స్టాలిన్ విమర్శించారు. ఆ అప్పులు తీర్చి పథకాలు అమలు చేస్తామని నమ్మబలుకుతున్నారని స్టాలిన్ ఆరోపించారు. ఆర్థిక విధ్వంసం అంటూ కల్లబొల్లి మాటలు చెప్పడం మాని ఇప్పటికైనా కూటమి నాయకులు సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలని స్టాలిన్ డిమాండ్ చేశారు.

నేటి నుంచి రాజగోపాలస్వామి కల్యాణ మహోత్సవాలు

నరసాపురం రూరల్: పట్టణంలోని స్టీమర్ రోడ్డులో ఉన్న రుక్మిణీ సత్యభామ సమేత శ్రీరాజగోపాల స్వామి వారి కల్యాణ మహోత్సవాలు శనివారం నుంచి 14 వరకూ నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్య నిర్వాహణాధికారి కొండవేటి రామచంద్రరావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. శనివారం ధ్వజారోహణం, 9న గరుడవాహనంపై గ్రామోత్సవం అనంతరం రాత్రి రుక్మిణీ సత్యభామ సమేత శ్రీరాజగోపాల స్వామి వారి కల్యాణం, 10న విశేషార్చనలు, భగద్గీత పారాయణం అనంతరం సాయంత్రం రథోత్సవం నిర్వహించనున్నారు. అనంతరం మూడు రోజుల పాటు పొన్న, శేష, గజ వాహనోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు వివరించారు. 14న స్వామివారికి చక్రస్నానంతో కల్యాణోత్సవాలు ముగుస్తాయని పేర్కొన్నారు. ఈ ఉత్సవాల నేపథ్యంలో 19న అఖండ అన్న సమారాధన కార్యక్రమం నిర్వహిస్తామని స్పష్టం చేశారు.

పేకాడుతున్న నలుగురి అరెస్ట్

యలమంచిలి: మండలంలోని ఆర్యపేట శివారున ఉన్న పొలం గట్లపై పేకాడుతున్నారనే సమాచారం మేరకు శుక్రవారం దాడి చేసి నలుగురు వ్యక్తులను పట్టుకున్నట్లు ఎస్సై కర్ణీడి గుర్రయ్యా తెలిపారు. వారి వద్ద నుంచి పేక ముక్కలు, రూ.3070 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన వివరించారు.

మండుతున్న ఎండలు

పది గంటలకే నిర్మానుష్యంగా రోడ్లు



పెనుగొండలో నిర్మానుష్యంగా ఉన్న రహదారి

పెనుగొండ: మార్చిలోనే ఎండల తీవ్రత పెరిగిపోవడంతో ప్రజలు అల్లాడుతున్నారు. మహా శివరాత్రి నుంచి ఎండల తీవ్రత నెమ్మదిగా పెరుగుతుందంటారు. కానీ, ఈ ఏడాది ఒక్కసారిగా ఎండలు మండిపోతున్నాయి. దీనికి తోడు ఉక్కబోత ప్రారంభం కావడంతో హడలిపోతున్నారు. వారం రోజులుగా ఎండ తీవ్రత పెరుగుతూ వస్తుంది. గురు, శుక్ర వారాల్లోనే 34 డిగ్రీలకు పైగా ఉష్ణోగతలు నమోదు అయ్యాయి. దీంతో రహదారులు అన్నీ 10 గంటలు దాటే సరికి నిర్మానుష్యంగా మారుతున్నాయి. పెనుగొండ, ఆచంట, పెనుమంట్ర, పోడూరు మండలాల్లో ఎండలు మండిపోతున్నాయి. ఇప్పుడే ఎండల తీవ్రత ఇంతలా ఉంటే ఏప్రిల్, మే నెలల్లో ఎండల తీవ్రత ఇంకెంతగా ఉంటాయో నంటూ ఆందోళనకు గురవుతున్నారు.

ఉదయం మంచు.. మధ్యాహ్నం ఎండ

శివరాత్రితో మంచు కురవడం ఆగిపోతుందంటారు.. కానీ ఉదయం వేళ మంచు కురుస్తూనే ఉంది. పొగ మంచు ఎదురుగా వాహనాలు కనిపించనంతటిగా కురుస్తుంది. దీంతో చలి తీవ్రత ఎక్కువగా ఉంటుంది. ఉదయం 10 గంటలు దాటితే ఎండ తీవ్రత నెమ్మదిగా పెరుగుతూ మధ్యాహ్నం 2 గంటలకు ఉక్కబోత ఉక్కిరిబిక్కిరి చేసేంతగా పెరుగుతుండడంతో చిన్నాపెద్దా లేకుండా అందరూ అల్లాడుతున్నారు. ఎండ తీవ్రతకు మధ్యాహ్న సమయంలో దుకాణాలు మూసేస్తున్నారు. ఎండల తీవ్రతతో దాహార్తి పెరుగుతుండడంతో రహదారుల పొడవునా పుచ్చకాయల దుకాణాలు, కొబ్బరి బొండాల దుకాణాలు వెలుస్తున్నాయి. దీనికి తోడు జ్యూస్ దుకాణాలు రహదారి వెంబడి పెరుగుతున్నాయి.



రహదారి పక్కనే ఏర్పాటు చేసిన కొబ్బరి బొండాల దుకాణం



రోడ్డు పక్కన పుచ్చకాయల దుకాణాలు

ఇబ్బందులుపడుతున్న చిన్నారులు

ఎండ వేడిమి పెరుగుతున్నా పాఠశాలలు రెండుపూటలా కొనసాగిస్తుండడంతో చిన్నారులు ఇబ్బందులకు గురవుతున్నారు. విద్యార్థుల ఇబ్బందులు తొలగించడానికి ఒంటిపూట బడులు ప్రారంభించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.